

బాలాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న సినీతార కీర్తి సురేశ్

## బాలాపూర్‌లో సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం

బడంగ్‌పేట, అక్టోబర్ 1 : సినీతార కీర్తి సురేశ్ బాలాపూర్‌లో సందడి చేసింది. బాలాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సీఎంఆర్ షాపింగ్ మాల్స్‌ను ఆదివారం కీర్తి సురేశ్ ప్రారంభించింది. తనకు నచ్చిన వస్త్రాలను ధరించి ఆనందం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటు ధరలో అన్ని రకాల వస్త్రాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధినేత శ్రీ అల్లక సత్యానారాయణ తదితరులు ఉన్నారు.



ప్రముఖ గోల్డ్, డైమండ్, సిల్వర్, ప్లాటినమ్ ఆభరణాల షోరూం భీమ జువెలర్స్ తమ నూతన స్టోర్‌ను ఆదివారం చందానగర్‌లో ప్రారంభించింది. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథరెడ్డితో పాటు సినీనటి అనుపమా పరమేశ్వరన్ హాజరయ్యారు.

– కొండాపూర్, అక్టోబర్ 1



## బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించేలా పింక్ లైటింగ్

సిటీబ్యూరో, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ) : బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించేలా నగరంలో చారిత్రక కట్టడాలు, నిర్మాణాలను గులాబీ వెలుగులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బ్రెస్ట్ క్యాన్సర్ అవేర్‌నెస్ మాసోత్సవాలు చేపట్టారు. ఈ మాసోత్సవాలలో భాగంగా పెయింట్ ది సిటీ పింక్ క్యాంపెయిన్ నిర్వహిస్తోంది. నగరంలోని చార్మినార్, హుస్సేన్ సాగర్ బుద్ధ విగ్రహం, టీ హబ్, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జిలకు పింక్ లైటింగ్ ఏర్పాటు చేసినట్లు ఫౌండేషన్ సీఈఓ, డైరెక్టర్ డా. పి రఘురామ్ పేర్కొన్నారు. ఏటా ప్రతి నాలుగు నిమిషాలకు ఒక మహిళ మహమ్మారి బారిన పడుతున్నదని, ప్రతి ఇద్దరిలో ఒకరికి బ్రెస్ట్ క్యాన్సర్ లక్షణాలు ఉంటున్నాయన్నారు. పలు అధ్యయనాల నేపథ్యంలో అవగాహన కల్పించి, ముందుగానే గుర్తించి చికిత్స తీసుకోవడంతో ప్రాణనష్టం తగ్గించడానికి వీలు ఉంటుందని తెలిపారు.

# దళితుల సాధికారతలో జలమండలి ముందంజ..!

ఇప్పటికే సీవర్ జెట్టింగ్ యంత్రాలతో యజమానులైన కార్మికులు

- తాజాగా.. మరో 162 మందికి మేలు
- నేడు మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా మురుగు వ్యర్థాల రవాణా వాహనాల అందజేత
- ఉద్యోగ, ఉపాధితో.. ఒక్కో వాహనంపై రూ.90 వేల ఆదాయం




సిటీబ్యూరో, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): దళితుల సాధికారతలో జలమండలి తనదైన పాత్ర పోషిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళితబంధు పథకంలో భాగంగా జలమండలి లబ్ధిదారులకు 162 మురుగు వ్యర్థాల రవాణా వాహనాలను అందిస్తున్నది. మురుగు వ్యర్థాల తరలింపు వాహనాల పంపిణీ ప్రక్రియను సోమవారం గాంధీ జయంతి రోజున హుస్సేన్‌సాగర్ తీరంలోని భారీ అంబేద్కర్ విగ్రహం ఎదుట మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నారు. దళిత కుటుంబాలకు జీవనోపాధి కల్పించడం, నగరాన్ని మరింత పరిశుభ్రంగా ఉంచేందుకు సిల్ట్ కార్టింగ్ (మురుగు వ్యర్థాల రవాణా) వాహనాల ముఖ్య ఉద్దేశమని జలమండలి ఎండీ దానకిశోర్ తెలిపారు. జలమండలి గతంలోనూ ఇలాంటి చర్యలు చేపట్టిందని, 2017లో ప్రవేశపెట్టిన సీవర్ జెట్టింగ్ యంత్రాలతో పలువురు కార్మికులను యజమానులను చేసిందని ఎండీ గుర్తు చేశారు. ఈ వాహనాలను తీసుకోవడం వల్ల లబ్ధిదారుడు యజమానిగా ఉంటూ.. మరోవైపు డ్రైవర్‌గా కూడా ఉపాధి పొందుతున్నాడని తెలిపారు. ప్రతి వాహనానికి ఇద్దరు మజ్దూర్లు కావాల్సి ఉన్నందున.. ఆ కుటుంబంలోని వారే ఇద్దరు కార్మికులుగా కూడా ఉపాధి పొందే వీలు ఉంటుందన్నారు.

**నాలుగు జిల్లాల లబ్ధిదారులు.. 162 వాహనాలు**

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాలకు సంబంధించిన 162 మందిని అధికారులు ఎంపిక చేశారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ సంబంధిత ఎమ్మెల్యేల ఆమోదం మేరకు ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో జరిగింది. వీరందరికీ ఒక్కో వాహనం చొప్పున 162 వాహనాలను అందిస్తున్నారు. ఈ లబ్ధిదారులకు వీటిపై గత నెల 26న అవగాహన కల్పించారు. జలమండలి పరిధిలో ఉన్న 162 సెక్షన్లలో.. సెక్షన్‌కు ఒకటి చొప్పున వీటిని కేటాయించనున్నారు. వాటి పరిధిలోనే వీరు పనిచేయాల్సి ఉంటుంది.

**జిల్లాలు.. వాహనాల సంఖ్య**

| జిల్లా | వాహనాలు |
|---|---|
| హైదరాబాద్ | 88 |
| రంగారెడ్డి | 35 |
| మేడ్చల్‌- మల్కాజిగిరి | 37 |
| సంగారెడ్డి | 02 |
| మొత్తం | 162 |

### మరిన్ని సేవలందించేందుకు..

నగరంలో పారిశుధ్య నిర్వహణకు జలమండలి ఇప్పటికే అనేక చర్యలు చేపట్టింది. మ్యాన్‌హోల్ శుభ్రం చేసిన తర్వాత అందులో నుంచి తీసిన వ్యర్థాలు (సిల్ట్) ఎప్పటికప్పుడు అక్కడి నుంచి తొలగించేందుకు నూతన వాహనాలను తీసుకువచ్చింది. వీటిని మురుగు వ్యర్థాల రవాణా (సిల్ట్ కార్టింగ్) వాహనాలు అంటారు. వీటిని దళితులకు అందజేయడం, వారి కుటుంబాలకు మేలు జరుగుతుందని ప్రభుత్వం భావించింది. ఈ వాహనాల ద్వారా మ్యాన్‌హోల్స్ వద్ద సిల్ట్‌ని ఎప్పటికప్పుడు తొలగించి మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు వీలవుతుంది.

### కలిగే ప్రయోజనాలు..

- జాబ్ గ్యారెంటీ పద్ధతిలో ప్రతి సిల్ట్ కార్టింగ్ వాహనానికి జలమండలి పని కలిపిస్తుంది.
- చెత్తను తొలగించి నిర్దేశించిన స్థానానికి రవాణా చేయడానికి నెలవారీ ప్రాతిపదికన అద్దె చార్జీలు చెల్లిస్తుంది. దీంతో పాటు లేబర్, నిర్వహణ ఖర్చులను సైతం జలమండలే చెల్లిస్తుంది.
- ఏఎంసీ నిబంధనల ప్రకారం.. వాహనాలు ఎప్పటికప్పుడు మంచి కండీషన్‌లో ఉంచడానికి వారికి ప్రతి మూడు మాసాలకు ఒకసారి వెహికల్ చెకింగ్, సర్వీస్ చార్జీలను వాహన నిర్మాణ సంస్థకు చెల్లిస్తుంది.
- ఇందులో ప్రతి వాహనానికి ఒక డ్రైవర్ సహా ఇద్దరు సహాయకులు ఉంటారు. ఈ వాహనాలకు లబ్ధిదారులు కుటుంబ సభ్యులే. డ్రైవర్, సిబ్బందికి కలిసి నెలకు సుమారుగా రూ.1.20 లక్షల ఆదాయం వస్తుంది. విధి నిర్వహణలో ధరించే బూట్లు, యూనిఫాం, హెల్మెట్, గ్లౌజ్ వంటి రూ. 3వేల విలువజేసే భద్రతా పరికరాలను జలమండలే అందిస్తున్నది.

### వాహన నిర్వహణ వివరాలు (నెలకు)

దళిత బంధు కింద తీసుకునే మురుగు వ్యర్థాల తరలింపు వాహనానికి జలమండలి ద్వారా జరిగే చెల్లింపుల ప్రక్రియ ఇలా ఉంటుంది.

**(ఒక్కో వాహనానికి ఇలా)**

వాహనానికి అద్దె చార్జీ – రూ.23,150

డ్రైవర్ – రూ.27,090

మజ్దూరు (కార్మికులు) ఇద్దరు – రూ.43,680 (ఒక్కరికి రూ.21,840 చొప్పున)

డీజిల్ ఖర్చు (రోజుకు 8 లీటర్లు) రూ. 21, 840

లుబ్రికెంట్ రూ. 1000

ఇన్సూరెన్స్ రూ. 2,500

ఇతర ఖర్చులు రూ. 740

మొత్తం.. రూ.1.20 లక్షలు

162 వాహనాలకు ఒక నెలకు కలిపి రూ.1.94 కోట్లు ఖర్చు కాగా.. సంవత్సరానికి రూ.23.33కోట్లు అవసరమవుతాయి.

### ఏడాదికి రూ.10 లక్షల పైనే..

దళితబంధు పథకంలో భాగంగా ఒక్కో యూనిట్ కింద రూ.10 లక్షల చొప్పున ఇవ్వనున్నందున రూ.16.20 కోట్లతో 162 మందికి ఈ వాహనాలను ఇస్తున్నారు. ఒక్కో వాహనం ఖరీదు రూ.9.50 లక్షలు కాగా.. రిజిస్ట్రేషన్, ఇతరత్రా ఖర్చుల కింద రూ.50వేల చొప్పున లబ్ధిదారులకు అందజేస్తున్నారు. 162 వాహనాలను అద్దెకు తీసుకోవడం ద్వారా వాటికి జరిగే చెల్లింపులు, లబ్ధిదారుడికి వచ్చే ఆదాయం, నిర్వహణ వ్యయం ఇలా అన్ని కోణాల్లో జలమండలి అధికారులు ప్రాజెక్టు వివరాలను రూపొందించారు. దాని ప్రకారం ఒక్కో వాహనానికి జలమండలి నెలకు రూ.1.20 లక్షలు చెల్లించనున్నది. ఇందులో నిర్వహణ వ్యయం పోగా.. ఒక్కో దళిత కుటుంబానికి రూ.90వేలకు పైగా (ఆ కుటుంబంలోని వారే డ్రైవరు, కార్మికులుగా పని చేస్తే) ఆదాయం వస్తుంది. అంటే.. ఏడాదికి ఒక్కో కుటుంబ ఆదాయం సుమారు రూ.పది లక్షలకు పైగానే ఉంటుంది.

# వయస్సు 6.. డ్రాయింగ్ 10 అడుగులు

- మహాత్ముడి పెయింటింగ్ వేసిన బుడతడు

మియాపూర్ , అక్టోబర్ 1 : ఆరేండ్ల చిన్నారి అద్భుతమైన చిత్రకళతో భళా అనిపించాడు. తన ఎత్తు మూడున్నర అడుగులైనా.. పది అడుగుల మేర మహాత్ముడి చిత్రాన్ని కేవలం 2 గంటల వ్యవధిలో గీసి తన నైపుణ్యాన్ని చాటుకున్నాడు. ఫలితంగా విశ్వగురు వరల్డ్ రికార్డ్ సాధించాడు. హైదర్‌నగర్ డివిజన్ నిజాంపేట రోడ్డుకు చెందిన ఆరేండ్ల హెచ్‌బీ హనుచరణ్ స్థానిక సంఘమిత్ర పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. మహాత్మాగాంధీ 154వ జయంతిని పురస్కరించుకుని తన నివాసంలో పది అడుగుల ఎత్తు, 7.6 అడుగుల వెడల్పున్న గాంధీ చిత్రాన్ని రెండు గంటల వ్యవధిలో గీశాడు. చిన్నారి హనుచరణ్ అద్భుత ప్రతిభను చాటుకున్నట్లు విద్యార్థి డ్రాయింగ్ గురువు సత్యవోలు రాంబాబు తెలిపారు. ఈ విద్యార్థి ప్రతిభను గుర్తించిన విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ అవార్డును ప్రకటిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి డాక్టర్ ఎంఆర్‌ఎస్ రాజు తెలిపారు. మూడేండ్ల ప్రాయం నుంచే చిత్రకళపై చిన్నారికి ఉన్న ఆసక్తిని గుర్తించి తగిన శిక్షణను ఇప్పిస్తున్నట్లు హనుచరణ్ తల్లిదండ్రులు మౌనిక, సంతోష్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రమాదేవి, గంగాధర్, మాధవి తదితరులు పాల్గొన్నారు.



తాను గీసిన మహాత్మాగాంధీ 10 అడుగుల పెయింటింగ్ వద్ద తన తల్లిదండ్రులు, గురువుతో చిన్నారి హనుచరణ్